క్లుప్తంగా

అంబేడ్కర్ అందరి నాయకుడు



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కౌతాళం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరి నాయకుడని వాల్మీకి రాష్ట్ర నాయకుడు తోవి నరసప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తోవి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన రాసిన రాజ్యాంగం నేడు ప్రపంచలోనే అత్యుత్తమైన వాటిలో ఒకటన్నారు. అలాంటి నేత విగ్రహం తమ గ్రామంలో కూడా ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ జయరామ్, నాయకులు అంజినయ్య, చంద్రయ్య స్వామి, మునెప్ప పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

ఆదోని రూరల్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వినతుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వాటిని పరిశీలించి వారం రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేడు స్పందన

ఆదోని టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివిధ సమస్యలతో ఇబ్బందులు పడే ప్రజలు స్పందనలో పాల్గొని దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. మహావీర్ జయంతి సందర్భంగా మాంసం విక్రయదారులు దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. అందుకు విరుద్ధంగా షాపులను తెరిచి మాంసం విక్రయాలను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం




మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆదోని అర్బన్ : ఏరుసలేము ప్రార్థనా మందిరం పాస్టర్ విక్టర్‌పాల్‌ఫిలిప్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మట్టలతో పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం యేసు క్రీస్తు బోధనలను వివరించారు. రాంబాబు, కమల, పద్మ, రాణి, జోయ్, మున్నా పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కటిక బషీర్ అనే వ్యక్తి 70 కర్ణాటక మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపర్చగా జడ్జి గురుఅరవింద్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

గడ్డివాముల దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదోని రూరల్ : మండలంలోని విరుపాపురం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన హరిజన ప్రాంచీస్, హరిజన యల్లప్ప, హరిజన శాంతప్పకు చెందిన గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ అరుణమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి మంటలను ఆర్పి వేశారు. బాధితులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. కాగా..ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పక్కనే ఉన్న గడ్డివాములకు ముప్పు తప్పింది.

నమోదు చేసుకోండి

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ట్రెనింగ్ రెండో విడతలో ఉచిత శిక్షణ నమోదుకు ఈ నెల 3వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ మాధురి తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిగ్యూటీవ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం 8500783459 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పది పరీక్షలు

- డివిజన్‌లో 79 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 16,200 మంది విద్యార్థులు
- 800 మంది ఇన్విజిలేటర్లు,189 మంది చీఫ్ ఎగ్జామినర్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆదోని అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఇటు అధికారులు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయగా, అటు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఎదురుచూస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకునేలా ఏర్పాటు చేసుకోవాలని విద్యార్థులకు అధికారులు సూచిస్తున్నారు. నేటి నుంచి ఈనెల 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

డివిజన్‌లో 79 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 16,200 మంది విద్యార్థులు

డివిజన్‌లో 79 పరీక్ష కేంద్రాల్లో 16,200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆదోని నియోజకవర్గంలో 17 కేంద్రాల్లో 3,985 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందులో పెద్దహరివాణం గ్రామంలో 290 మంది, పెద్దతుంబళం గ్రామంలో 300 మంది విద్యార్థులు రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. మొత్తం 17 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తారు. డివిజన్ పరిధిలో 800 మంది ఇన్విజిలేటర్లు, 189 మంది చీఫ్ ఎగ్జామినర్లను నియమించారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం..

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్ని రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సులను నడపనున్నారు. విద్యార్థులు వారి నివాసం నుంచి ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకు వీలు కల్పించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు అస్వస్థత, అనారోగ్యానికి గురికాకుండా పరీక్ష కేంద్రాల్లో ఏఎన్ఎంల నియామకంతో పాటు తగిన మెడికల్ కిట్లను వైద్య ఆరోగ్యశాఖ అందుబాటులో ఉంచింది. మొబైల్ మెడికల్ వాహనాలు కూడా అందుబాటులో ఉండనున్నాయి. కేంద్రాల్లో ఫర్నీచర్‌తో పాటు వెంటిలేషన్, పరిశుభ్ర వాతావరణం ఉండేలా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. శాంతిభద్రతల నిర్వహణకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉండనుంది. పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్, కేంద్రాల సమీపంలోని నెట్ సెంటర్‌లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. అంతేగాకుండా పరీక్షలు జరిగినన్ని రోజులు నిరతరం విద్యుత్ సరఫరా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం



చీఫ్ ఎగ్జామినర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో సహా విద్యార్థులు ఎవరూ పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, కెమెరాలు, ఇయర్ ఫోన్‌లు, స్పీకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం. ప్రతి పరీక్ష కేంద్రంలో 12 మంది ఇన్విజిలేటర్లు, ఒకరు రిజర్వ్, ఇద్దరు డిప్యూటీ ఈఓలు, ఒకరు రిజర్వ్‌లో ఉంటారు.

– శివరాములు, ఎంఈఓ

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వాల్మీకులు రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. వాల్మీకులను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదికను పంపారన్నారు. ఆదివారం ఛలో కర్నూలు కార్యక్రమానికి ఆదోని నుంచి దాదాపు వంద వాహనాల్లో వెయ్యి మందికి పైగా వాల్మీకులు తరలివెళ్లారు. స్థానిక ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వాహనాల్లో తరలివెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కిషోర్, దుర్గప్ప, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు లక్ష్మీనారాయణ, పాండురంగడు, బ్రహ్మీ, రామకృష్ణ, లక్ష్మన్న, దస్తగిరినాయుడు, సింహం నాగేంద్ర పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఆదోని అర్బన్ : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్–2 కన్వీనర్ మధుసూదన్‌శర్మ తెలిపారు. ఆదివారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని, వాటి అమలు తీరు, గతంలో పరిస్థితిని నేటితో పోల్చి ప్రజలకు వివరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు ఎవరికైనా అందకపోతే వివరాలు సేకరించి అర్హులైతే అందేలా చేయాలని చెప్పారు. అలాగే పార్టీ సూచించిన అంశాలతో ప్రజాభిప్రాయాలను సేకరించాలని సూచించారు.సమ్మతమైతే ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్ అతికించి 8296082960కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందజేయడానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారధిగా అందరూ పని చేయాలని కోరారు.



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథులు

సీపీఆర్‌తో ప్రాణాలను నిలపొచ్చు

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని విజయవాడకు చెందిన అనెస్తెటిస్ట్, బీఎల్ఎస్ ట్రైనర్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న బీఎల్ఎస్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేసిక్ లైఫ్ సపోర్ట్ కోర్సులో భాగంగా సీపీఆర్ ఎలా నిర్వహించాలనే దానిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర కల్కూర, డాక్టర్ శ్రీలత, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



కోర్సు అభ్యసించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ అశోక్, డాక్టర్ చంద్రశేఖర్

కామద ఏకాదశి వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం కామద ఏకాదశి వేడుకలు నిర్వహించారు. హరే కృష్ణ హరే రామ నామ జపం సామూహికంగా పఠించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సంధ్యా హారతి, తులసి హారతి, రాజభోగ నివేదన చేశారు. అనంతరం ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు ప్రవచనం చెప్పారు.



స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

గిరక పోటీల విజేత కైరుప్పల వృషభాలు

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని నిర్వహించిన గిరక పోటీల్లో ఆస్పరి మండలం కైరుప్పల గ్రామ వృషభాలు విజేతగా నిలిచాయి. ఆదివారం ఈ పోటీలను గ్రామ పెద్ద, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సిబి.జానకీరామిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.20,016లు కైరుప్పల బంట్రోత్ ఎద్దులు, రెండవ బహుమతి రూ.10,016లు గుడేకల్ గ్రామానికి చెందిన నల్లన్న ఎద్దులు, మూడవ బహుమతి రూ.5,016లు కారుమంచి గ్రామానికి చెందిన ఆత్మానంద ఎద్దులు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఆలూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సింహాద్రిని గత మూడు రోజుల క్రితం సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత రెండు నెలల క్రితం నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అయితే తన కార్యాలయంలో ఉన్న జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను గోడలపై నుంచి తొలగించి అవమానపరిచారు. ఈ విషయాన్ని సహచర అధ్యాపకులు బయటకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో విద్యార్థి సంఘ నాయకులు తదితరులు కలసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గుట్టు చప్పుడు కాకుండా విచారణ నిర్వహించి నివేదికను అధికారులకు అందజేశారు. దీంతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

వాల్మీకుల అభ్యున్నతికి సీఎం కృషి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: వాల్మీకుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో వాల్మీకి కులస్తుల ఎదుగుదలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు అసెంబ్లీలో తీర్మాణం చేయడంపై జిల్లా కేంద్రం కర్నూలులో వాల్మీకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పేందుకు ఆదివారం చేపట్టిన భారీప్రదర్శన, సభకు ఆలూరు నియోజకవర్గంలో స్థానిక మంత్రి నివాసం నుంచి దాదాపు 500 వాహనాలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ వాల్మీకి కులస్తులను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ కార్పొరేషన్, జెడ్పీ చైర్మన్లను చేయడమే కాకుండా స్థానిక సంస్థల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ ఇలా అనేక రకాలుగా పదవులు కట్టబెట్టడం చారిత్రక విషయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాల్మీకి కులస్తులకు ఉన్న ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించాలని కోరిన నాయకులను చంద్రబాబునాయుడు మెడపట్టి గెంటేశారని మంత్రి గుర్తుచేశారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో అన్నింటా వెనుకబడిన వాల్మీకులు రాజకీయాల్లో ఎదిగేందుకు సహకారం అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి వెంట వాల్మీకి కులస్తులందరూ ఉంటారని ఆయన పేర్కొన్నారు. కర్నూలుకు తరలి వెళ్లిన వారిలో మంత్రి సోదరులు నారాయణ స్వామి, గట్టు చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, సింగిల్ విండో చైర్ పర్సన్ ఈరమ్మ, వైస్ ఎంపీపీ నాగవేణి, వీఆర్‌పీఎస్ నాయకులు రాంభీమ్‌నాయుడు, బీసీ మాదన్న, వెంటేశ్వర్లు, వీరాంజి, హనుమయ్య, వీరేష్, విక్రాంత్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా హాలహర్వి ఎంపీపీ నెట్టకంటిమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ నాగేష్, దేవనకొండ మండల వాల్మీకి ప్రతినిధులు మల్లికార్జున, రాజన్న తదితరులు తరలివెళ్లారు. ఆస్పరి, హొళగుంద, చిప్పగిరి మండలాల నుంచి వాల్మీకులు కర్నూలుకు వెళ్లారు.



కర్నూలుకు తరలివెళ్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, వాల్మీకి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా ధరణీధర్‌రెడ్డి జన్మదినం

మంత్రాలయం రూరల్/కౌతాళం/కోసిగి : మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుమారుడు వైఎస్సార్‌సీపీ యువనేత వై.ధరణీరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మంత్రాలయం పార్టీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో రాఘవేంద్రసర్కిల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఓబులాపురం గ్రామానికి చెందిన భీమన్న గౌడ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో, కౌతాళం వేంకటేశ్వర స్వామి, మేళిగనూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో బంటకుంట సర్పంచ్ గోపాల్ రెడ్డి, కుంబళూరు సర్పంచ్ వీరేష్, వడ్డె రామన్న, ప్రహ్లాదాచారి ప్రత్యేక పూజలు చేశారు. కోసిగిలో పి.మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేపట్టారు. ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. నాడుగేని నరసింహులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

7న 'శ్రీ హనుమద్వైభవం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ రాముడు రచించిన 'శ్రీ హనుమద్వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ నెల 7వ తేదీ ఉదయం 9.30 గంటలకు గణేష్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ తాళ పత్ర పరిశోధకులు వైద్యం వెంకటేశ్వరాచార్యులు, శతావధాని మద్దూరి రామమూర్తి, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. సాహితీ ప్రియులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి అదృశ్యం



వెంకటేష్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (24) అదృశ్యమైనట్లు ఆదివారం కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 29వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంకటేష్ ఇటీవలే పోలీసు పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

నేటి నుంచి శ్రీకల్బుర్గి శరణ బసవేశ్వర పురాణం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు శ్రీకల్బుర్గి శరణ బసవేశ్వర పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, ఆలయ సేవా సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తులకు నేడు తుది గడువు

ఆలూరు రూరల్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులకు నేడు(సోమవారం) తుది గడువని ఆలూరు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వీరేష్ తెలిపారు. ఆదివారం ఆయన పత్రిక ప్రకటన విడదల చేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ (వాయిస్, నాన్ వాయిస్) కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పది, ఇంటర్ చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. వివరాల కోసం 9010003132 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

ఆఖిరి మజిలీలోనూ అవస్థలే!

- మరుభూమిని వీడని ఆక్రమణలు
- మృతదేహం తీసుకెళ్లేందుకు దారి కరువు
- తుంగభద్ర, వాగుల సమీపంలో శ్మశాన వాటికలు
- అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్న వైనం
- కబ్జాలపై నోటీసులతో సరిపెడుతున్న అధికారులు

మంత్రాలయం రూరల్: మరణం చేరినా వారి ఆత్మీయులకు కడగండ్లు తప్పడం లేదు. మృతదేహానికి తుది వీడ్కోలు పలకడానికి కూడా దారి లేకపోవడంతో తల్లడిల్లుతున్నారు. కొందరు అక్రమార్కులు మరుభూములను ఆక్రమిస్తుండటంతో ఖననం చేయడానికి కూడా ఆరడుగల స్థలం కరువవడంతో పల్లె వాసుల కంట కన్నీరలొకుతోంది. కాగా ఇటీవల ప్రభుత్వం శ్మశానాలను రూపుదిద్దాలని ఆదేశించడంతో వారిలో ఆశలు మినుక్కుమంటున్నాయి.

- నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, పెద్ద కడబూరు,కౌతాళం మండలాల్లోని శ్మశాన వాటికలన్నీ దాదాపు నదీ తీరంలోనే ఉన్నాయి. దీంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతలు తవ్వే సమయంలో నీటి ఊటలు వస్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. మరి కొన్ని వంకలకు అవతలి వైపు ఉండటంతో వర్షాకాలంలో అంత్యక్రియలకు వాగు దాటాల్సి వస్తోంది. దీంతో ఆ సమయంలో బాధితులకు అవస్థలు తప్పడం లేదు.

సమస్యలివి..

- మంత్రాలయం మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో సర్వే నంబర్ 126 లో 3.54 ఎకరాలు ఉంది. పక్కనే ఉన్న వంక పోరంబోకు భూమిని అక్రమార్కులు ఆక్రమించడంతో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లాలంటే దారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు నామామాత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికకు వెళ్లేందుకు అవసరమైన రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే మంత్రాలయం తుంగభద్ర నది తీరంలో ఉండటంతో నదిలో నీటి ప్రవాహం పెరిగిన సమయంలో అంత్యక్రియలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం కొంత స్థలాన్ని కేటాయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నారయణపురం గ్రామంలో శ్మశానవాటిక చుట్టూ వరి పొలాలు ఉండటంతో గుంతలు తీసే సమయంలో నీటి ఊటలు వస్తుండటంతో ఖననానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త స్థలం కేటాయించాలని, లేదంటే గుంతగా మారిన శ్మశానాన్ని చదును చేయిస్తే సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వగరూరు గ్రామంలో ఊరి నడిబొడ్డున శ్మశానవాటిక ఉండటంతో ఇబ్బందిగా ఉంది. గ్రామ శివారులో స్థలం కేటాయించాలని పల్లె వాసులు కోరుతున్నారు.
- కౌతాళం మండలంలోని పొదలకుంటలో శ్మశాన వాటిక స్థలం తక్కువగా ఉంటడంతో అంత్యక్రియలకు ఇబ్బందికరంగా మారింది. నదిచాగిలో ముస్లింల శ్మశాన వాటికకు వెళ్లాలంటే వరి పొలాలు దాటాల్సి ఉండటంతో పంటల కాలంలో మృతదేహాన్ని తరలించేందుకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు.
- కోసిగి మండలంలోని జూమ్మాలదిన్నె గ్రామంలో శ్మశాన స్థలం తక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కోసిగిలోని సజ్జలగుడ్డం రహదారిలోని దళితుల శ్మశానవాటికకు ఎల్లెల్సీ కాలువ సమీపంలో ఉండటంతో శ్మశానంలోకి నీరు చేరుతుంది. దీంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పెద్దకడబూరులోని బీసీ శ్మశాన వాటిక స్థలాన్ని అదే మండలానికి చెందిన ఓ నేత కొంతమేర ఆక్రమించాడు. దీంతో స్థలం సరిపోక అంత్యక్రియలకు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.



చెట్నహళ్లి గ్రామంలో పంట పొలాల మధ్య మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

సీఎం నిర్ణయం అభినందనీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని చర్చి, శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.కోటి కేటాయించడం అభినందనీయం. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఆయా గ్రామాల్లోని శ్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, చర్చీల పునర్నిర్మాణానికి కృషి చేస్తాం.

– చిక్కెం జానయ్య, జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంత్రాలయం

ఆక్రమణదారులకు నోటీసులిచ్చాం



చెట్నేహళ్లి గ్రామంలో శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించిన వారికి ఇప్పటికే నోటీసులిచ్చాం. త్వరలోనే శ్మశాన వాటికకు వెళ్లేందుకు అవసరమైన రస్తా కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, తహసీల్దార్, మంత్రాలయం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



చెట్నేహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురైన విషయంపై ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

– రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు, చెట్నేహళ్లి